# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా స్మారక తపాలాబిళ్ల, నాణేలను విడుదల చేస్తారు.**

2. **భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ తెలంగాణలో ని మెదక్ లో జరిగే సేంద్రీయ రైతుల సదస్సులో ఈ రోజు పాల్గొంటారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాలు, చిన్న పట్టణాల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈరోజు నుంచి మూడు రోజులపాటు పర్యటించనున్నారు.**

5. **యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్నారు.**

=========================

ప్రధానమ్రంతి నరేంద్రమోదీ ఈ రోజు మధ్యప్రదేశ్‌లో పర్యటించి. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తారు. దేశంలో మొట్టమొదటి నదీ అనుసంధాన కార్యక్రమమైన కెన్ – బెత్వా నదుల జాతీయ అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఖాండ్వా జిల్లా ఓంకారేశ్వర్‌లో నీటిపై తేలియాడే సోలార్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభిస్తారు. అలాగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా స్మారక తపాలాబిళ్ల, నాణేలను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. ఒక వేయి 153 అటల్ సుశాసన్ భవనాలకు శంకుస్థాపన చేస్తారు. ప్రాంతీయ స్థాయిలో గ్రామ పంచాయతీలు సుపరిపాలన అందించడంలో ఈ భవనాలు కీలకపాత్ర పోషించనున్నాయి.

-----------------------

భారత రత్న, మాజి ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజ్ పేయి 100వ జయంతిని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. వాజ్ పేయి జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ సుపరిపాలనా దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈసందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. ప్రస్తుత మధ్యప్రదేశ్లోని గ్వాలియర్ లో 1924 డిసెంబరు 25వ తేదిన వాజ్ పేయి జన్మించారు. 1996 నుండి 2004వ సంవత్సరం వరకు మూడు పర్యాయాలు వాజ్ పేయి ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందించారు. ఆయన ప్రధానిగా ఉ

న్న సమయంలో పోఖ్రాన్ అణు పరీక్షలు జరిగాయి. పాకిస్తాన్తో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు రహదారులు అత్యంత కీలకమని భావించిన ఆయన జాతీయ రహదారుల విస్తరణ కోసం స్వర్ణ చతుర్భుజి, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, పాఠశాల విద్యాభివృద్ధి కోసం సర్వశిక్ష అభియాన్ వంటి ప్రజాదరణ పథకాలను ప్రవేశపెట్టారు. వాజ్ పేయి తన 94వ ఏట 2018 ఆగష్టు 16వ తేదిన ఢిల్లీలో తుదిశ్వాసవిడిచారు. వాజ్ పేయి జయంతి సందర్భంగా పార్లమెంటులో ఆయన చేసిన ఉపన్యాసంలోని కొంత భాగాన్ని ఇప్పుడు విందాం

వాయిస్ 27 సెకన్లు

---------------------------

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఈ రోజు, రేపు తెలంగాణలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా తునికిలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్– ×జూా= లో జరిగే సేంద్రీయ రైతుల సదస్సుకు ముఖ్య అతిథిగా హజరై రైతులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పాల్గొంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాలు, చిన్న పట్టణాల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కో–వర్కింగ్ స్పేస్, నైబర్హుడ్ వర్కింగ్ స్పేస్ల అభివృద్ధిపై సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదుచోట్ల రతన్ టాటా ఆవిష్కరణ కేంద్రాల ఏర్పాటుకు భవనాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలు, విద్యా సంస్థలను ఈ హబ్లకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇంటి నుంచి పని విధానంతో మానవ వనరుల సమర్థ వినియోగం జరుగుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులను పారదర్శకంగా నిర్వహిస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో 33 జిల్లాల గృహ నిర్మాణ పథక సంచాలకులుతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేసి త్వరతగతిన పూర్తి చేస్తామని చెప్పారు. 20 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్( 30 సెకన్లు)

---------------------------

సమర్థవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే సుపరిపాలన కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రశాసన్ గావ్కి ఒరే –2024లో భాగంగా.. ఈ నెల 19 నుంచి జిల్లాలో నిర్వాహించిన సుపరిపాలన వారోత్సవాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో ఆయన మాట్లాడుతూ, అటల్ బిహారి వాజ్ పేయి జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ సుపరిపాలనా దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి

ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్ ( 30 సెకన్లు)

కాగా జాతీయ సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈరోజు నుంచి మూడు రోజులపాటు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా వైయస్సార్ జిల్లాలోని సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లెకు చేరుకుంటారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి స్థానికులతో సమావేశమవుతారు. అనంతరం పెండ్లిమర్రి మండలం యల్లటూరులో ప్రకృతి వ్యవసాయం, ఫసల్‌బీమా యోజన లబ్ధిదారులతో సమావేశమై, ఉద్యాన పంటలను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల నిర్వహిస్తున్నారు. ఏసుక్రీస్తు జనన సందేశాన్ని అందించే నక్షత్రాన్ని రంగుల కాగితాలు, వెదురు బద్దలతో తయారు చేసి ఇళ్ళ ముందు అలంకరించారు. ఇతరుల పాపాలను ప్రక్షాళన చేసేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన ఏసుక్రీస్తు కు ప్రతీకగా భావించే క్రిస్మస్ చెట్టును ఇళ్ళ ముందు ఏర్పాటు చేసుకొన్నారు.

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధన్ ఖడ్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్ అబ్దుల్ నజీర్, జిష్ణు దేవ్ వర్మ, ముఖ్య మంత్రులు ఎన్. చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్ మోహన రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలలో ఐక్యత, శాంతిని పెంపొందించడానికి క్రిస్మస్ పండుగ మనకు స్ఫూర్తి నిస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు.

---------------------------

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్నందున ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సముద్రంలో గరిష్ఠంగా గంటకు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని కళింగపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుల్లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే

అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న ఐదు రోజులు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవ్వే అవకాశం ఉందని వాతావారణ కేంద్రం పేర్కొంది.

======================